క్లుప్తంగా

ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణ

తాళ్లపూడి(కొవ్వూరు): ప్రజాసమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. కొవ్వూరులోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ వేదికలో వచ్చిన అర్జీలను ఆర్డీవో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో 10 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు జాతర

నల్లజర్ల: పోతవరం గంగానమ్మ జాతర ఐదో రోజుకు చేరింది. ఈ జాతరకు విఘ్నాలు కలగకుండా, గ్రామస్తులంతా ఏకతాటిపై సాగాలని కోరుతూ సోమవారం దుర్గా సూక్త అలోమ, విలోమ హోమాన్ని వేద పండితులు నిర్వహించారు. పసుమర్తి రాజేష్ దంపతులు పూజాదికాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రభల సంబరం జరిగింది.

రేషన్ పంపిణీకి అంతరాయం

దేవరపల్లి: సర్వర్ మొరాయించడంతో రేషన్ సరకుల పంపిణీకి అంతరాయం ఏర్పడింది. దేవరపల్లి మండలంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి సర్వర్ మొరాయించడంతో రేషన్ దుకాణాల వద్ద పంపిణీ ఆగిపోయింది. దీంతో కార్డుదారులు గంటల తరబడి దుకాణాల వద్ద పడిగాపులు పడ్డారు. కార్డుదారులకు సమాధానం చెప్పలేక డీలర్లు తలలు పట్టుకున్నారు. ఒకపక్క ఎండ తీవ్రత, మరో పక్క సర్వర్ సమస్యతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు.

తలారి పరామర్శ

చాగల్లు: చాగల్లుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వర్ధినీడి చినబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా చినబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చాగల్లు పార్టీ కార్యకర్త బోలిపో నాగమణి ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను తలారి వెంకట్రావు పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ మట్టా వీరాస్వామి, మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, మాజీ సర్పంచ్ లకంసాని సూర్యప్రకాశరావు, ఆర్టీఏ విభాగం జిల్లా అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, బొర్రా కృష్ణ, బొర్రా రజినీ ప్రసాద్, గెడా శ్యామ్, బలుసు శేఖర్, గెడ్డం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మాధురికి 2213 ర్యాంకు



వేగేశ్వరపురంలో మాధురిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

తాళ్లపూడి: వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సిద్ధా మాధురి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 2213 ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం సభ్యులు మాధురిని ఘనంగా సత్కరించారు. మాధురి ఉన్నత విద్యకు భరోసా కల్పిస్తామని ఆమె తండ్రి సిద్ధా పోశియ్యకు పూర్వ విద్యార్థి సంఘం తరపున హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు అడ్డాల డేవిడ్ రాజు, మారిశెట్టి సత్యనారాయణ, శీర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ గోదాముల తనిఖీ

చాగల్లు: ఊనగట్లలోని సివిల్ సప్లయిస్ మండలస్థాయి స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్ గోదామును రాష్ట్ర సివిల్ సప్లయిస్ కమిషనర్ సౌరబ్ గౌర్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో సరుకు నిల్వలు పరిశీలించారు. అనంతరం చాగల్లులో తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రేషన్ కార్డులో పేర్ల మార్పులు, చేర్పుల నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు.

పసలపూడిలో రక్తదాన శిబిరం

ఉండ్రాజవరం: పసలపూడి గ్రామానికి చెందిన వేము శ్రీధర్ జ్ఞాపకార్థం అతని స్నేహితుల ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. తణుకు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 15 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీధర్ స్నేహితులు సీహెచ్.విజయ్, ఎం.సువర్ణరాజు, ఎన్.సురేష్, టి.వెంకటరావు, వై.ఏడుకొండలు, వై షాలెం, ఆదిత్య బిర్లా హెల్త్ మేనేజర్ నాగేంద్ర పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

నిడదవోలు రూరల్: రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని డ్రెయిన్లలో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక తెలిపారు. మండలంలోని సమిశ్రగూడెంలో చేపట్టిన పారిశుధ్య పనులను ఆమె సోమవారం పరిశీలించారు.

ప్రజలను నమ్మించి వంచించిన చంద్రబాబు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన



యర్నగూడెంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన, గురుమూర్తి రెడ్డి, మాజీ హోం మంత్రి తానేటి వనిత, జక్కంపూడి గణేష్



నిడదవోలు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు

దేవరపల్లి: ప్రజలను నమ్మించి చంద్రబాబు వంచించాడని, దీనిని ప్రజలకు వివరించి చైతన్యం తీసుకురావడానికి వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 4న అన్ని నియోజకవర్గాల్లో వెన్నుపోటు దినం కార్యక్రమానికి చేపట్టినట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలోని మాజీ హోం మంత్రి తానేటి వనిత క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో చెల్లుబోయిన వేణు పాల్గొని మాట్లాడారు. అధికారం కోసం కూటమి ప్రభుత్వం మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసినట్టు ఆయన తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తానని హామీలిచ్చి అధికారం చేపట్టిన తరువాత చంద్రబాబు ప్రజలను వంచించారని అన్నారు. ప్రజలకు జరిగిన అన్యాయంపై వైఎస్సార్ సీపీ శ్రేణులంతా గళమెత్తాలని ఆయన పిలుపునిచ్చారు. ఇసుక వల్ల వచ్చే ఆదాయాన్ని కూటమి నాయకులు దోచుకుంటున్నారని విమర్శించారు.

శాంతి భద్రతలపై ప్రభుత్వానికి దృష్టి లేదు

మాజీ హోం మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత మాట్లాడుతూ ఈ నెల 4న నల్లజర్లలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాలుగు మండలాల్లో వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించినట్టు తెలిపారు. పరిపాలన, ప్రజల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టకుండా అరాచకపాలన చేస్తున్నారని ఆమె తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై ప్రభుత్వానికి దృష్టి లేదన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు గురుమూర్తి రెడ్డి, ఉమ్మడి జిల్లాల యువజన విభాగం రీజనల్ కోర్డినేటర్ జక్కంపూడి గణేష్, దేవరపల్లి, నల్లజర్ల మండలాల పార్టీ అధ్యక్షులు కూచిపూడి సతీష్, వెల్లంకి సుబ్రహమణ్యం, ఎంపీపీ కేవీకే దుర్గారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, బీసీ విభాగం విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడిబోయిన గంగరాజు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి సత్తి సాయి ఈశ్వరరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గెడా జగదీష్, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, మండల మహిళా కన్వీనర్ కడలి హైమావతి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు బంకా అప్పారావు, గెడా రాంబాబు, ఎస్కే ముస్తఫా, సత్తి జగదీశ్వరరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్

నిడదవోలు: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ప్రజలను వంచించి వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శించారు. ఈనెల 4న నిడదవోలులో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులను కోరారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం వెన్నుపోటు దినం పోస్టర్లను నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఎన్నికల హామీలను అమలు చేయని కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని నిర్వహించనున్న ర్యాలీలో ప్రజలతోపాటు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నియోజవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను నమ్మిన ప్రజలు తమకు మేలు చేస్తారని భావించి ఓట్లు వేసి గెలిపిస్తే చివరకు ప్రజలనే చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పొడుస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంట్ నియోజవర్గ పరిశీలకులు గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ నిడదవోలులోని ఈనెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జక్కంపూడి గణేష్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, ఆకుల ముకుందరావు, దాకే అనిల్ కుమార్, ఎస్కే ఖాన్‌బాషా, తోలేటి కోటేశ్వరరావు, ఆలమూరు రాజా, పాలా కిరణ్, వంగా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



అజ్జరంలో పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

పెరవలి: రాష్ట్రంలో టీబీ రహిత గ్రామాలే లక్ష్యంతో 100 రోజుల కార్యక్రమం చేపట్టడం హర్షణీయమని, దీనిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తెలిపారు. పెరవలి మండలం అజ్జరంలో సోమవారం ఆయన పోస్టర్‌ను విడుదల చేసి ప్రసంగించారు. క్షయరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలంటే ప్రతి ఒక్కరి సహకారం ఉండాలని అందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఈ తేజశ్రీ మాట్లాడుతూ టీబీ వ్యాధి చాలా ప్రమాదకరమైనదని దీని నివారణకు మందులు వాడకుండా నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని అన్నారు. రోగికి రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి సమయాల్లో జ్వరం, బరువు తగ్గితే టీబీ పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ బాధితులకు వైద్యం, మందులు పూర్తిగా ఉచితంగా అందిస్తామన్నారు. టీబీ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ ఆశాజ్యోతి మాట్లాడుతూ గ్రామంలో 150 మందికి రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించామన్నారు. టీబీ రోగులకు పౌష్టికాహారం అందించేందుకు దాతలు ముందుకు రావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుధ, ఎంపీహెచ్ఓ రాజేష్, సీహెచ్ఓ శివ వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకి చెల్లుబోయిన పరామర్శ



బాబాజీరావును పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ, గురుమూర్తి రెడ్డి

దేవరపల్లి: రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత తండ్రి, మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావును సోమవారం యర్నగూడెంలోని ఆయన స్వగృహంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు గురుమూర్తి రెడ్డి, మాజీ హోం మంత్రి తానేటి వనిత, ఉభయగోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పరామర్శించారు. కొంతకాలంగా బాబాజీరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన ఆరోగ్యం గురించి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అడిగి తెలుసుకున్నారు.

నమ్మి ఓటేసిన ప్రజలనూ వెన్నుపోటు పొడిచారు

- 'వెన్నుపోటు దినం' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ
- చంద్రబాబు మోసాలను నిరసిస్తూ 4న వెన్నుపోటు దినం
- వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



చాగల్లులో 'వెన్నుపోటు దినం' వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు



'వెన్నుపోటు దినం' వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ కొవ్వూరు మండల పార్టీ శ్రేణులు

చాగల్లు: అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయడం, వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విమర్శించారు. చంద్రబాబు మోసాలను ఎండగడుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. చాగల్లులో మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్ నివాసంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం తలారి వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని ఆయన ఆరోపించారు. సూపర్ సిక్స్ పేరుతో హామీలిచ్చి అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారని ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తూ జైళ్లకు పంపడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 4న కొవ్వూరు మెరకవీధి నుంచి ఆర్డీఓ కార్యాలయానికి పెద్ద ఎత్తున్న ర్యాలీగా వెళ్లి ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరుతూ ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని తలారి పిలుపునిచ్చారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి, మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, మండల పార్టీ అధ్యక్షులు మట్టా వెంకట్రావు, పార్టీ సీనియర్ నాయకులు లకంసాని సూర్యప్రకాశరావు, పార్టీ జిల్లా ఆర్టీఏ విభాగం అధ్యక్షులు ఇంటి వీర్రాజు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జాలెం వెంకట్రావు, నాయకులు గేడా శ్యామ్, బొర్రా కృష్ణ, కుదప రాంబాబు, ఉన్నమట్ల బ్రాహ్మనందం, పొన్నాడ సింహాద్రి, మేకా రాజు, వీరవల్లి శివ, యార్లగడ జోషి, బొర్రా రజనీ ప్రసాద్, ఎస్కే షరీఫ్ పాల్గొన్నారు.

కొవ్వూరు మండల పార్టీ ఆధ్వర్యంలో

వైఎస్సార్ సీపీ కొవ్వూరు మండల పార్టీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం' వాల్‌పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆవిష్కరించారు. కొవ్వూరులో ఈ నెల 4న నిర్వహించే నిరసన కార్యక్రమానికి ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పరిమి సోమరాజు, సుంకర సత్యానారాయణ, మట్టా శ్రీను, ఉప్పులూరి సూరిబాబు, మరపట్ల శ్రీనివాస్, తోట నారాయణ పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తాళ్లపూడి: ప్రజలకు హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా గాలికి వదిలేసిన చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకు వెళతామని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొలిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. పెద్దేవం పంచాయతీ పరిధిలోని రావూరుపాడులో మండల వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని అందుకే తమ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈ నెల 4న వెన్నుపోటు దినం పేరుతో రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా ఉపాధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, జిల్లా యాక్టివ్ కార్యదర్శి వంబోలు పోశిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బట్టు సుబ్బారావు, నాయకుడు నూతంగి సురేష్, సర్పంచ్‌లు ఆమ్మిరెడ్డి పరశురామారావు, తిగిరిపల్లి వెంకట్రావు, సీనియర్ నాయకులు కుంటముక్కల కేశవనారాయణ, పోసిన శ్రీ కృష్ణ దేవరాయలు, వల్లభసెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యపుగుంట చెరువు ఆక్రమణ పరిశీలన

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతల డిమాండ్

సాక్షి ఇంపాక్ట్

నిడదవోలు: పట్టణంలో బాలాజీనగర్‌లో మున్సిపల్ స్థలం బియ్యపుగుంట చెరువును పూడ్చివేసిన రియల్‌ఎస్టేట్ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బాలాజీనగర్‌లో బియ్యపుగుంట చెరువును పూడ్చివేసిన ఆక్రమణదారుల వైనాన్ని వివరిస్తూ గతనెల 31న చెరువు గుట్కాయస్వాహా శీర్షికతో నిడదవోలు సీపీఎం నాయకులు స్పందించారు. సోమవారం పూడ్చివేసిన బియ్యపుగుంట చెరువును సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ రైతులు, పశువులకు ఉపయోగపడే చెరువును యథావిధిగా ఉంచాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. రాత్రికి రాత్రే ఆక్రమణదారులు పూడ్చివేసిన చెరువు ఆక్రమణపై స్థానిక తహసీల్దారు, మున్సిపల్ కమిషనర్లకు రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన సరిహద్దులు పైప్‌లైన్ గొట్టాలు వాటర్ ట్యాంక్ కోసం ఏర్పాటు చేసిన పంపింగ్ షెడ్డును కూల్చివేసినట్లు స్పష్టంగా కన్పిస్తోందన్నారు. లారీలతో మట్టి తరలించి రూ.కోట్లు విలువ చేసే స్థలాన్ని కబ్జా చేశారని రాంబాబు తెలిపారు. దీనిపై రైతులు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణికి ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎటువంటి చర్యలు లేకపోవటం, హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చెయ్యకపోవటం అధికారుల పనితీరుపై పలు అనుమానాలు కలుగుతున్నాయన్నారు. రెండేళ్ల క్రితం మున్సిపాలిటీ అధిరారులు చెరువు సరిహద్దులను నిర్ణయించి హద్దులు ఏర్పాటు చేశారన్నారు. వెంటనే ఆక్రమణలు తొలగించి పూడ్చి వేసిన చెరువును యథాస్థితిలో ఉంచకపోతే పెద్దఎత్తున మున్సిపల్ ఆస్తులను కాపాడటం కోసం ఉద్యమం చేపడతామని రాంబాబు హెచ్చరించారు. గారపాటి ప్రసన్న కృష్ణ, ఓ. గోపీ రైతులు పాల్గొన్నారు.



బియ్యపుగుంట చెరువు పూడికను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కారులో తరలిస్తున్న గోవుల స్వాధీనం

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరులోని గామన్ బ్రిడ్జి టోల్ ప్లాజా వద్ద ఆవులను తరలిస్తున్న ఆవులను తరలిస్తున్న కారును పోలీసులు అడ్డుకున్నారు. గోసంరక్షణ సమితి సభ్యుల సమాచారం మేరకు కొవ్వూరు పట్టణ పోలీసులు తనిఖీ చేపట్టి తెలంగాణకు తరలిస్తున్న నాలుగు ఆవులను, కారును స్వాధీనం చేసుకున్నారు.

క్రికెట్ పోటీలకు ఎంపిక

గోపాలపురం: మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన తానింకి యశశ్రీ ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల అండర్-15 బాలికల విభాగం అంతర్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైందని ఆమె తండ్రి సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఈ నెల 1న భీమవరంలో జరిగిన అండర్-15 బాలికల విభాగంలో యశశ్రీ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందన్నారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకూ మంగళగిరిలో జరిగే పోటీల్లో తన కుమార్తె పాల్గొంటుందని తెలిపారు.

శ్రీవారి ఆలయానికి విరాళం

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన జుట్టా సూరిబాబు, అంజమ్మ దంపతులు, వారి కుమారులు సీతారామయ్య, దుర్గాకృష్ణసాయి సోమవారం రూ.27 వేల విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాస్‌కు అందజేశారు.

ముందుజాగ్రత్తగా పూడికతీత

దేవరపల్లి: ఏటా వర్షాకాలంలో ముంపునకు గురవుతున్న డ్రైనేజీలో పూడికతీత పనులు చేపట్టారు. దళితవాడల మీదుగా ఊర చెరువు వరకు వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తూ, లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్న డ్రైనేజీ పూర్తిగా పూడుకుపోయింది. దీంతో పూడికతీసి శుభ్రం చేస్తున్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌గా వజీరుద్దీన్ ఎంపిక

- జనసేన నాయకులకు తలొగ్గిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ వజీరుద్దీన్
- టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు గైర్హాజరు
- బాయ్‌కట్ చేసిన 14 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు



మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎంపికైన ఎస్కే వజీరుద్దీన్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఏపీ ఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్

నిడదవోలు: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం ఏపీ ఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ. దుర్గేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎస్కే వజీరుద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని 28 వార్డు సభ్యులకు, ఎక్స్ అఫీషియో సభ్యులకు ఫారం - 11లో నోటీసు జారీ చేశారు. నిడదవోలు పురపాలక సంఘంలో 28 వార్డు కౌన్సిలర్లు ఉన్నారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. ఈయన ఓటుతో కలుపుని వైస్ చైర్మన్ ఎన్నికకు 15 మంది సభ్యుల బలం ఉంది. ఎన్నికల నిర్వహణ కోసం కోరం సరిపోవడంతో నియమావళిని అనుసరించి వైస్ చెర్ పర్సన్ పదవికి నిర్ణయించిన సమయంలో ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలకు వైఎస్సార్ సీపీకి చెందిన 14 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు కూడా గైర్హాజరయ్యారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎన్నికను పురస్కరించుకుని 22వవార్డు కౌన్సిలర్ ఎస్కే వజీరుద్దీన్‌ను బలపరుస్తూ కౌన్సిలర్ గంగుల వెంకటలక్ష్మీ ప్రతిపాదించగా 23వ వార్డు కౌన్సిలర్ మద్దిపాటి నాగశ్రీ బలపరిచారు. ఎన్నికల పరిశీలకులుగా జేసీ ఎస్. చినరాయుడు, కొవ్వూరు ఆర్డీవో రాణిసుస్మిత, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి పాల్గొన్నారు.

పొత్తు ధర్మానికి జనసేన నాయకులు మంగళం

కూటమి పొత్తు ధర్మానికి జనసేన నాయకులు మంగళం పాడారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావుకి మొండిచేయి చూపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మీ తన పదవికి రాజీనామా చేసినప్పటి నుంచి రాజకీయాల్లో అనూహ్యంగా మార్పులు జరిగారు. మున్సిపల్ వీసీ పదవి ఎవరికి ఇవ్వాలనే అంశంపై జనసేన నాయకులు ముల్లగుల్లాలు పడ్డారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలో చేరిన కౌన్సిలర్ పువ్వల రతీదేవి, టీడీపీ కౌన్సిలర్ నాగేశ్వరరావు వైస్ చైర్మన్ పదవి కోసం పోటీపడ్డారు. జనసేన, టీడీపీ మధ్య వర్గపోరులో కారింకి నాగేశ్వరరావు జనసేన నాయకులకు సన్నిహితంగా ఉంటున్నారనే కారణంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, పార్టీ శ్రేణులు నాగేశ్వరరావుకి మద్దతు ఇవ్వకపోవడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వైస్ చైర్మన్ పదవి ఆశించి భంగపడ్డ టీడీపీ కౌన్సిలర్ నాగేశ్వరరావు వీసీ ఎన్నికలకు గైర్హాజరయ్యారు. కౌన్సిలర్లు నాగేశ్వరరావు, పువ్వల రతీదేవిని కాదని అనూహ్యంగా రాత్రికి రాత్రే వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఎస్కే వజీరుద్దీన్‌ను ప్రలోభాలకు గురిచేసిన జనసేన నాయకులు ఆయన పేరును తెరపైకి తీసుకువచ్చారు. స్వయంగా మంత్రి కందుల దుర్గేష్ వజీరుద్దీన్‌కు జనసేన కండువా కప్పి స్వయంగా తీసుకువచ్చి వీసీ పదవిని కట్టబెట్టారు. 2021లో జరిగిన ఎన్నికల్లో 27 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు గెలుపొందగా టీడీపీ నుంచి నాగేశ్వరరావు ఒక్కరే విజయం సాధించినా చివరకు భంగపాటు తప్పలేదు.